క్లుప్తంగా

నాంచారుపల్లిలో ఎన్‌ఎస్‌ఎస్ శ్రమదానం



శ్రమదానం చేస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

సిద్దిపేటఅర్బన్: సిద్దిపేట ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో మండలంలోని నాంచారుపల్లిలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలో ఐదు రోజుల పాటు శ్రమదానం నిర్వహించనున్నారు. అందులో భాగంగా శనివారం యాదవ సంఘం ప్రాంగణంలో వాలంటీర్లు స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి, పభుత్వ పాఠశాల హెచ్‌ఎం సుజాత పాల్గొన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి నగేశ్, ఉపాధ్యాయులు దేవరాజు, శ్రీనివాస్, యూత్ లీడర్ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల ముగింపు



బహుమతులతో విజేతలు, ఉపాధ్యాయులు

చిన్నకోడూరు(సిద్దిపేట): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోను రాణించాలని ప్రిన్సిపాల్ సతీశ్‌కుమార్ ఆకాంక్షించారు. మండల పరిధిలోని ఇబ్రహీంనగర్ మోడల్ స్కూల్‌లో మేరా యువభారత్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన క్రీడలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే గెలుపోటములను సమానంగా తీసుకోవడం చేసుకోవాలన్నారు. వాలీబాల్, కబడ్డీ, టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్ క్రీడల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పీడీ ప్రవీణ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగులు అందజేత



స్కూల్ బ్యాగులు, పుస్తకాలతో విద్యార్థులు

మిరుదొడ్డి(దుబ్బాక): సామజిక సమరసత వేదిక, యూత్ ఫర్ సేవా సహకారంతో అందె గ్రామీణ వికాస్ సేవా సమితి సభ్యులు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న నిరుపేద విద్యార్థులకు, తల్లిదండ్రులు లేని వారికి శనివారం స్కూల్ బ్యాగులు, నోట్ పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామీణ వికాస్ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి



రైతులతో మాట్లాడుతున్న ఏఈఓ ప్రవీణ్

దుబ్బాకటౌన్: ప్రతీ రైతు కాపాస్ కిసాన్ యాప్‌లో తమ పంట వివరాలను తప్పక నమోదు చేసుకోవాలని ఏఈఓ ప్రవీణ్ సూచించారు. రాయపోల్ మండలం రాంసాగర్‌లో కాపాస్ కిసాన్ యాప్ గురించి రైతులకు అవగాహన కల్పించారు. పత్తి పంటను విక్రయించడానికి రైతులు యాప్‌లో ముందుగానే స్లాట్ బుక్ చేసుకోవాలని చెప్పారు. రైతులు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు.

డీసీసీ అధ్యక్ష పదవికి యాదగిరి నామినేషన్



నామినేషన్ పత్రం అందజేస్తున్న యాదగిరి

నంగునూరు(సిద్దిపేట): సిద్దిపేట డీసీసీ అధ్యక్ష పదవికి నామినేషన్ వేసినట్లు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేవులపల్లి యాదగిరి తెలిపారు. నంగునూరులో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గజ్వేల్‌లో నిర్వహించిన కార్యకర్తల అభిప్రాయ సేకరణ సందర్భంగా ఏఐసీసీ పరిశీలకురాలు జ్యోతి రాతోలేకు నామినేషన్ అందజేశారు.

కఠిన చర్యలు తప్పవు

మద్దూరు(హుస్నాబాద్): ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక రవాణాచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ షేక్‌మహబూబ్ హెచ్చరించారు. చేర్యాల మండలంలోని అర్జున్‌పట్ల గ్రామంలోని మోయతుమ్మెద వాగు నుంచి ఆకుల దినేశ్ అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. ట్రాక్టర్‌ను సీజ్‌చేసి అతనిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

బీసీ బంద్ ప్రశాంతం

- వ్యాపార, వాణిజ్య, విద్యాసంస్థల మూసివేత
- పాల్గొన్న ప్రజా సంఘాలు, వివిధ పార్టీల నేతలు

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు కోరుతూ రాష్ట్ర బీసీ సంఘాల జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు అన్ని మండలాల్లోను బంద్ శనివారం ప్రశాంతంగా జరిగింది. బీసీ సంఘాలు, బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, డీఎస్‌పీ, కమ్యూనిస్టు పార్టీల నాయకులు మద్దతుగా నిలిచారు. జాతీయ రహదారులు, కూడళ్లలో బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, బ్యాంకులను మూసివేయించారు. వివిధ వ్యాపార వాణిజ్య దుకాణాలు యజమాన్యాలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. రిజర్వేషన్లు అమలు చేయకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



దౌల్తాబాద్‌లో ..



చిన్నకోడూరులో బైక్ ర్యాలీ..



నంగునూరులో అఖిల పక్ష నేతల ర్యాలీ



మిరుదొడ్డిలో రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు



హుస్నాబాద్: మల్లెచెట్టు చౌరస్తాలో టైర్లు కాల్చి నిరసన



అక్కన్నపేటలో..



గజ్వేల్: ఆర్టీసీ డిపో వద్ద ధర్నా చేస్తున్న బీసీ, ప్రజా సంఘాల నేతలు



జగదేవ్‌పూర్‌లో రోడ్డుపై బైఠాయించిన వివిధ పార్టీల నాయకులు



దుబ్బాకలో ఆందోళన చేస్తున్న బీసీ నేతలు



మద్దూరులో ఎస్ఐతో సీపీఎం నేతల వాగ్వాదం



బెజ్జంకిలో బంద్‌లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు



కోహెడలో బంద్‌లో పాల్గొన్న నేతలు



వర్గల్(గజ్వేల్): తున్కిఖాల్సాలో..



కొమురవెల్లి ఉన్నత పాఠశాల వద్ద..

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ పరామర్శ

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన అబ్బుల బాల్‌నర్సాగౌడ్, పెండ్యాల లక్ష్మణ్ కుటుంబ సభ్యులను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య శనివారం పరామర్శించారు. అలాగే గుండె ఆపరేషన్ చేయించుకొని చికిత్స పొందుతున్న బక్కి మల్లేశంను పలకరించి మనోధైర్యం కల్పించారు. ఆయన వెంట మాజీ ఉప సర్పంచ్ వడ్ల ప్రభాకర్, నాయకులు జెన్నారెడ్డి, నర్సింహులు, సురేశ్‌గౌడ్, స్వామి, కొండల్, అనిల్ తదితరులు ఉన్నారు.

దౌల్తాబాద్‌లో..

దౌల్తాబాద్(దుబ్బాక): మండల పరిధిలోని తిర్మలాపూర్‌కు చెందిన పలువురి కుటుంబ సభ్యులను వెంకటయ్య పరామర్శించారు. ఆ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బండారు రాజయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. అలాగే జనగామ



మృతుల కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న వెంకటయ్య

దయాకర్ పాము కాటుతో మరణించారు ఆయా కుటుంబాలను ఆయన ఓదార్చారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నరసింహారెడ్డి తల్లి మరణించిన విషయం తెలుసుకుని ఆ కుటుంబాన్ని కూడా పరామర్శించారు. ఆయన వెంట రహీమొద్దీన్, దేవేందర్, హైమద్, యాదవరెడ్డి, రమేశ్‌గౌడ్, బాల్‌రెడ్డి, వెంకటయ్య, కృష్ణ, స్వామి, సత్తయ్య, లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

జిల్లా పంచాయతీ అధికారిగా వినోద్ కుమార్

సిద్దిపేటరూరల్: జిల్లా నూతన పంచాయతీ అధికారిగా జి.వినోద్ కుమార్‌కు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు విధులు నిర్వహిస్తున్న దేవకీదేవి బదిలీపై వెళ్ళారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నూతన డీపీఓగా వినోద్‌కుమార్ త్వరలో విధుల్లో చేరనున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జగదేవ్‌పూర్(గజ్వేల్): జగదేవ్‌పూర్ కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఇంగ్లిష్ బోధించడానికి అతిథి అధ్యాపకుడి పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ సైదులు, పాఠశాల ప్రిన్సిపాల్ స్రవంతి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి కలవారు 25లోగా పాఠశాలలో సంప్రదించాలని కోరారు.

దళారులకు అమ్మి మోసపోవద్దు

మిట్టపల్లి పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్

సిద్దిపేటఅర్బన్: ఆరుగాలం కష్టపడి పండించిన పంటను దళారులకు అమ్మి రైతులు మోసపోవద్దని, నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో విక్రయించి మద్దతు ధర పొందాలని మిట్టపల్లి పీఏసీఎస్ చైర్మన్ చింతల శ్రీనివాస్ సూచించారు. మిట్టపల్లిలో శనివారం ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం రైతులు ధాన్యాన్ని పొలాల వద్దనే ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శంకర్, కాంగ్రెస్ నాయకులు



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న శ్రీనివాస్ తదితరులు

శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు జేపీ యాదవ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **చిరుధాన్యాల్లో పోషకాలు పుష్కలం**

జగదేవ్‌పూర్(గజ్వేల్): చిరుధాన్యాల్లోనే పోషకాలు పుష్కలంగా లభిస్తాయని, తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని ఏఓ వసంతరావు, పీస్ సంస్థ డైరెక్టర్ నిమ్మయ్య అన్నారు. ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా శనివారం జగదేవ్‌పూర్‌లోని పీస్ సంస్థ ఆధ్వర్యంలో ఆహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుతున్న కాలనుగుణంగా ఆహార అలవాట్లను మార్చుకోవాలన్నారు. మూడు పూటల అన్నం తినడం వల్ల షుగర్ వ్యాధి వచ్చే అవకాశం ఉందని, చిరుధాన్యాలను తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యుడు సత్యప్రకాశ్, అరుణ, సిబ్బంది శోభ, నాగలక్ష్మి, వెంకటమ్మ, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

◆ **రాయపోల్‌లో కళాజాత**

దుబ్బాకటౌన్: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే సీజనల్ వ్యాధులు దరి చేరవని తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల బృందం టీమ్ లీడర్ ఆస రామారావు అన్నారు. రాయపోల్ మండలం ఆరేపల్లిలో శనివారం ఓటుహక్కు వినియోగం, పరిసరాల పరిశుభ్రతపై పాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. కళాకారులు నర్సింహులు, ఎల్లం, తుమ్మల ఎల్లం, శేఖర్ పాల్గొన్నారు.

◆ **బీసీ పొలిటికల్ జేఏసీ ఏర్పాటు**

మిరుదొడ్డి(దుబ్బాక): బీసీ రిజర్వేషన్ సాధనే ధ్యేయంగా బీసీ మండల పొలిటికల్ జేఏసీని శనివారం ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్టు వివిధ పార్టీల నాయకులు తెలిపారు. కన్వీనర్లుగా టి.బాల్‌రాజు, పోలీస్‌రాజులు, సీహెచ్ మల్లేశం, వి.శివ, ఎస్.నర్సింహులు, కో కన్వీనర్లుగా కె.శ్రీనివాస్, ఎం.రాజు, కె.యాదగిరి తదితురులు ఎంపికయ్యారు.



బాలసదనంలో చిన్నారులతో కలసి బాణసంచా కాలుస్తున్న అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్

ఉత్సాహంగా ముందస్తు దీపావళి

- బాలసదనంలో పండుగ సందడి
- చిన్నారులతో అదనపు కలెక్టర్ గరీమా

సిద్దిపేటజోన్: అనాథ పిల్లల అవాస కేంద్రం బాలసదనం, శిశుగృహాల్లో శనివారం రాత్రి ముందస్తు దీపావళి శోభ సంతరించుకుంది. జిల్లా శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో శనివారం రాత్రి దీపావళి సంబురాలు నిర్వహించారు. వేడుకల్లో అదనపు కలెక్టర్ గరీమాఅగర్వాల్ పాల్గొన్నారు. పిల్లలతో కలిసి లక్ష్మీదేవి పూజలు చేసి అనంతరం బాణసంచా కాల్చి సందడి చేశారు. సుమారు గంటపాటు బాలసదనం పిల్లలతో ఆప్యాయంగా గడిపారు. వారికి బహుమతులు అందజేశారు. బాలల సంరక్షణ అధికారి రాము, సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తం

ఎస్ఐ రాజేశ్

సిద్దిపేటరూరల్: గ్రామాల్లోని ప్రజలు సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రాజేశ్ సూచించారు. మండల పరిధిలోని వెంకటాపూర్‌లో శుక్రవారం రాత్రి పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ నగదు వ్యవహారాల్లో జాగ్రత్తగా ఉండాలన్నారు. అలాగే ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాలకు చెక్ పెట్టాలని పిలుపునిచ్చారు. కళాబృందం బాలు, రాజు, తిరుమల, సాంస్కృతిక బృందం రవి, రవీందర్, ఎల్లయ్య, తిరుమలయ్య, రవీందర్, బాబాయి, క్రాంతి, దేవదాస్, రవీందర్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

చిన్నకోడూరు(సిద్దిపేట): నూతన చట్టాలపై అందరికీ అవగాహన ఉండాలని షీ టీమ్ ఏఎస్ఐ కిషన్ సూచించారు. మండల పరిధిలోని ఇబ్రహీంనగర్ మోడల్ స్కూల్‌లో మహిళల భద్రత అందరి బాధ్యత అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడ పిల్లలను ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే శిక్షార్హులు అవుతారన్నారు. ఎవరైనా వేధించినా, వెంటపడినా, అవమానించినా నిర్భయంగా షీ టీమ్‌కు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సతీశ్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

‘ఉపాధి’ పనుల్లో అవకతవకలు

- నిర్వహణలో నిర్లక్ష్యం
- ఫీల్డు అసిస్టెంట్లు, కార్యదర్శులపై ఉన్నతాధికారుల అసహనం

హుస్నాబాద్‌రూరల్: జాతీయ ఉపాధిహామీ పథకం పనుల్లో అవకతవకలు వెలుగు చూశాయి. డీఆర్‌డీఏ ఏపీడీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం మండల పరిషత్ ఆవరణలో మండల సభ నిర్వహించారు. ఈ సందర్భంగా 17 గ్రామాల్లో చేపట్టిన పనుల వివరాలను సభలో వెల్లడించారు. మస్టర్లపై కార్యదర్శులు సంతకాలు లేకపోవడం, మొక్కలు నాటినా క్షేత్ర స్థాయిలో అవి కన్పించకపోవడం, పనులు చేసిన కూలీలకు డబ్బులు రాకపోవడం లాంటి అంశాలు వెలుగులోకి వచ్చాయి. మీర్జాపూర్‌లో ఒకరైతు వ్యవసాయ భూమిలో మొక్కలు నాటినా ఒక మొక్క కూడా లేకపోవడం, గ్రామాల్లో వనమహోత్సవంలో నాటిన మొక్కలు 10 శాతం వరకు ఎండిపోవడం, పనులను పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షణ



గ్రామాల్లో పనుల వివరాలు పరిశీలిస్తున్న ఉన్నతాధికారులు

చేయడం లేదని స్పష్టమైంది. 15 సంవత్సరాలు గడిచిన ఉపాధిహామీ పథకం పనుల నిర్వహణలో అవే తప్పిదాలు జరుగడంతో అధికారులు ఫీల్డు అసిస్టెంట్లు, కార్యదర్శులపై అసహనం వ్యక్తం చేశారు. గ్రామాల్లో పనులు లేని చోట ఫీల్డు అసిస్టెంట్ల నుంచి రూ.9 వేలు రికవరీకి ఆదేశించారు. పనులు పర్యవేక్షించడంలో నిర్లక్ష్యం చేసిన కార్యదర్శులు, టీఏలకు రూ.16 వేలు జరిమానా విధించారు. సభలో ఎంపీడీఓ రమేశ్, ఏపీఓ పద్మ తదితరులు పాల్గొన్నారు.

షెడ్డు బిల్లు కట్టలేదని ఇంటి కనెక్షన్ కట్

- విద్యుత్ అధికారుల నిర్వాకం
- ఆవేదన వ్యక్తం చేసిన బాధితుడు

సిద్దిపేటరూరల్: వ్యవసాయ పొలంలో ఉన్న కోళ్ల షెడ్డుకు సంబంధించిన విద్యుత్ బిల్లు చెల్లించలేదని ఆగ్రహించిన విద్యుత్ అధికారులు ఇంటి కరెంట్ కనెక్షన్ కట్ చేశారు. ఈ ఘటన మండల పరిధిలోని పెద్దలింగారెడ్డిపల్లిలో శనివారం చోటు చేసుకుంది. ఆ గ్రామానికి చెందిన కరుణాకర్‌రెడ్డి విలేకరులతో తన గోడు వెళ్లబోసుకున్నాడు. కొద్ది రోజులుగా తన కుటుంబంలో నెలకొన్న ఆర్థిక సమస్యల వల్ల కోళ్ల షెడ్డుకు సంబంధించిన కరెంట్ బిల్లు కట్టలేదు. కొద్ది రోజులు సమయం ఇస్తే కడతానని చెప్పినప్పటికీ విద్యుత్ అధికారులు పట్టించుకోకుండా ఏఈ ఆధ్వర్యంలో షెడ్డు కనెక్షన్‌కు బదులుగా తన ఇంటి విద్యుత్ కనెక్షన్ కట్ చేశారని వాపోయాడు. ఈ విషయమై విద్యుత్ అధికారులను వివరణ కోరగా ఆరు



ఇంటి విద్యుత్ కనెక్షన్ కట్‌చేస్తున్న సిబ్బంది

నెలలుగా కోళ్ల షెడ్డు కరెంట్ బిల్లు బకాయి కట్టకపోవడం వల్లే ఇంటి విద్యుత్ కనెక్షన్ కట్ చేశామని చెప్పారు. బిల్లు చెల్లించాకనే కనెక్షన్ ఇస్తామని స్పష్టం చేశారు. ఈ సమస్యపై బాధితుడు డీఈకి ఫిర్యాదు చేశాడు.

గుంతల రోడ్డుతో చింత

చినుకు పడితే చిత్తడిచిత్తడే

- విన్నవించినా ఫలితం శూన్యం
- స్వయంగా మొరం వేసుకున్న రైతులు

దుబ్బాకటౌన్: రోడ్లు అభివృద్ధి చెందితే ఊరు అభివృద్ధి చెందుతుంది. గ్రామాలకు కూడా మంచి గుర్తింపు వస్తుంది. వాహనదారులకు ఇక్కట్లు తప్పుతాయి. కానీ రోజురోజుకు దుబ్బాకలో మాత్రం ఆ పరిస్థితి లేదని దుంపలపల్లి ప్రజలు వాపోతున్నారు.

అధికారుల నిర్లక్ష్య వైఖరి

దుంపలపల్లి నుంచి దుబ్బాక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వెళ్లే రహదారి పూర్తిగా ధ్వంసమైంది. దీంతో కంకర తేలి పొలాలకు వెళ్లే రైతులు, దుబ్బాకకు వచ్చే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బీటీ రోడ్డు వేయాలని ఎన్నిసార్లు అధికారులకు విన్నవించుకున్నా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు.

ప్రమాదాలు జరిగినా పట్టించుకోరా..

రోడ్డుపై కంకర తేలిన గుంతల రోడ్డుపై తరచూ వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. గాయాల పాలవుతున్నా పట్టించుకొనే వారు కరువయ్యారు.

మొరం రోడ్డు వేసుకున్న రైతులు

రోడ్డును బాగు చేయాలని సంబంధిత అధికారుల వద్దకు చెప్పులు అరిగేలా తిరిగారు. కానీ ఎలాంటి ఫలితం కనిపించలేదు. దీంతో విసుగు చెందిన రైతులు కంకర్‌పై మొరం రోడ్డు వేయాలని నిశ్చయించుకున్నారు. ఐదారుగురు రైతులు కలిసి సొంత నిధులతో కంకర రోడ్డుపై మొరం వేయించారు.


శాశ్వత పరిష్కారం చూపాలి

ఎంత మొరం పోసిని అది తాత్కలిక పరిష్కారమేనని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎంపీ రఘునందన్‌రావు శాశ్వత పరిష్కారం చూపాలని రైతులు, వాహనదారులు కోరుతున్నారు. నాలుగు కిలో మీటర్ల మేర ఉన్న కంకర రోడ్డును బీటీ వేసి పునరుద్ధరించాలని, రైతులు, స్థానికులకు ఇబ్బందులు తీర్చాలని వేడుకుంటున్నారు.



రైతులు వేసుకున్న మొరం రోడ్డు


మొరం పోయించాం



పొలాలకు వెళ్లాలంటే కంకర తేలిన, గుంతల రోడ్డుతో నిత్యం నరకయాతన పడే వాళ్లం. వర్షాకాలంలో రోడ్డంతా బురదమయంగా మారుతోంది. సమీప రైతులంతా కలిసి తలా కొంచెం పైసలు పోగుచేసుకొని మొరం రోడ్డు వేయించాం.

– పోలిశెట్టి కిష్టయ్య, రైతు, దుంపలపల్లి

రోడ్డు పునరుద్ధరించాలి



కంకర తేలిన రోడ్డుతో నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నాం. రహదారి కష్టాల నుంచి అధికారులు, నాయకులు వీలైనంత త్వరగా బయట పడేయాలి.

– బొజ్జ మల్లేశం, రైతు, దుంపలపల్లి